# అనుబంధం



గన్నవాజు సుందరరావు

"గుడ్ ఈవెనింగ్ డాక్టర్...." అంది రాధ లేచి కూర్చుంటూ.

"గుడ్ ఈవెనింగ్. హౌ డూ యూ డూ మిస్ రాధా...." అన్నాడు డాక్టర్ సుధాకర్ చిన్నగా నవ్వుతూ.

"ఓ.కే. డాక్టర్....నీరసం తగ్గింది.. అతనికెలా వుంది డాక్టర్?"

"నథింగ్ టు వర్రీ, హి విల్ బి ఆల్‌రైట్... గండం గడిచింది కాని కొద్దిరోజులు హాస్పిటల్‌లో వుండాలి." ప్రక్కన ఉన్న కుర్చీలో కూర్చున్నాడు సుధాకర్.

"థాంక్యూ డాక్టర్....అతని ప్రాణం కాపాడారు.. థాంక్యూ వన్స్ ఎగైన్..."

డాక్టర్ సుధాకర్ చిరునవ్వు నవ్వాడు.

"చూడండి మిస్ రాధా .... ఇందులో మీరు థాంక్స్ చెప్పాల్సినంత ఘనకార్యం నేనేం చేయలేదు. అది మా డ్యూటీ. సాధ్యమైనంతవరకూ ప్రాణం కాపాడడానికే ప్రయత్నిస్తాం. ఆ పైన దైవం అనుకూలించాలి. అది లేందే ఎవరూ ఏమీ చెయ్యలేరు .... విషమ పరిస్థితిలో పడి నేను కొట్టుమిట్టాడుతున్న సమయంలో పరుగు పరుగున మీరు వచ్చారు. అంతా సవ్యంగా జరిగింది. వేణు బ్రతికాడు. లేకపోతే నే నెన్ని విధాల ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయేది." అన్నాడు రాధకేసి అభిమానంగా చూస్తూ.

"అలా ఎన్నటికీ జరగదు డాక్టర్. నేను రాకపోయినా ఏదో విధంగా వేణు అపాయంనుంచి బయటపడతాడు. వేణు మంచి మనసున్న మనిషి. మానవత్వానికి మరో పేరు. అలాంటి సహృదయుణ్ని భగవంతు డెప్పుడూ ఆదుకుంటాడు...." రాధ కళ్ళు తుడుచుకుంది.

డాక్టర్ సుధాకర్ జాలిగా చూశాడు.

"మీరన్నది నిజం మిస్ రాధా. వేణు చాలా ఉత్తముడు. అతను నా ఆప్తమిత్రుడు. సృష్టిలో మధురమైనదీ, అమూల్యమైనదీ వేణుతో చేసిన స్నేహమే అవుతుంది. వేణూని దక్కించుకో లేనేమో, అలాంటి అమూల్య రత్నాన్ని జారవిడుచుకోవాలేమోనని మీ రాకకు ముందు విపరీతంగా కలవరపడ్డాను. కాని దైవం అనుగ్రహించి, మీ రూపంలో వచ్చి అతన్ని రక్షించాడు .... ఇంతకీ వేణు మీకెలా తెలుసు? అతను మీ దగ్గర బంధువా? .... ప్లీజ్ .... ఇలా అడుగుతున్నందుకు మీరు అన్యధా భావించవద్దు" అన్నాడు.

రాధ క్షణకాలం సుధాకర్ కేసి చూసింది.

అతని మాటల్లోకాని, చూపుల్లోకాని వ్యంగ్యధోరణి లేదనీ, నిష్కల్మషంగానే అడుగుతున్నాడని నిర్ధారించుకొని, "అతను నాదగ్గర బంధువూ కాదు. దూరపు చుట్టమూ కాదు. ఆత్మీయుడు. అంతకన్న దగ్గరవాడు. దేవుడు ....

రెండు సంవత్సరాల క్రితం నేనీ వూరొచ్చాను. అప్పటినుంచీ ఆరునెలల క్రితంవరకూ వాళ్ళింట్లోనే స్వ-దేదాన్ని.. ఆదరించాడు....గొప్ప వాడు కానీ....”

రాధ ముఖంలో విషాదచ్ఛాయలు అలుము కున్నాయి పెదవులు ఒణికిపోతుంటే మాట్లాడలేక తల వంచేసుకుంది.

సుధాకర్ హృదయం బాధగా మూలిగింది. అకస్మాత్తుగా రాధ ఎందుకలా మారిపోయిందో అంతుపట్టక సతమతమయాడు. ఆమె మనసు నొప్పించే విషయాలడిగి ఆమెను బాధకు గురిచేసినందుకు నొచ్చుకున్నాడు.

“మిస్ రాధా .... ప్లీజ్ .... బాధపడకండి....మీ గురించి తెలుసుకోవాలని కుతూహలంపడి ఆ వివరాలడిగాను. మీ మనసును గాయపరిచాను .... అయాం వెరీ వెరీ సారీ ..” అన్నాడు సుధాకర్ జీరపోయిన కంఠంతో.

రాధ చప్పున తలెత్తింది కళ్ళు తుడుచుకుంది. జీవంలేని నవ్వు నవ్వుతూ, “లేదు డాక్టర్ .... లేదు .... మీరలా అడిగినందుకు నేను బాధపడడం లేదు ఈ విషయం గురించి ఇంతవరకూ ఇంత ఆదరంగా, మర్యాదపూర్వకంగా ఎవ్వరూ అడగలేదు డాక్టర్... మీరింత ఆప్యాయంగా అడిగేసరికి అకస్మాత్తుగా గతంలో నేను పొందిన ఆప్యాయతలూ, ఆదరణలూ గుర్తుకొచ్చాయి. గతించిన రోజులు తల్చుకుంటూంటే ఎందుకో అరికట్టుకోలేని దుఃఖం ముంచుకొచ్చేస్తుంది, ఇది నా వీక్‌నెస్ అనండి మరేమైనా అనండి. ఆ సమయంలో నన్ను నేను కంట్రోల్ చేసుకోవడం కష్టతరంగా వుంటుంది....ఇప్పుడు కూడా అదే జరిగింది డాక్టర్ .... అంతే ....ఆ రోజులు మళ్ళీ రావాలి. ఆ ఇల్లు మళ్ళీ కళకళలాడాలి. అంతవరకూ ఈ అశాంతి నన్ను విడనాడదు. మనస్సు స్థిమితంగా వుండదు,” అంది రాధ ఆవేదనగా

సుధాకర్ కొన్ని క్షణాలు రాధకేసి చూశాడు. అతని హృదయం జాలితో నిండిపోయింది రాధ మాటల్లోని అంతరార్థం ఏమిటో బోధపడడం లేదు. కాని గతాన్ని గుర్తుకుతెచ్చుకుని కుమిలిపోతోందనీ, ఏ సంఘటనో ఆమె హృదయాన్ని తీవ్రంగా గాయపరచి వుంటుందనీ అందువల్ల మానసిక క్షోభకు గురియై కలతపడుతుందనీ, అన్నింటికీ మించి ఆత్మీయుడైన వేణు కోసం దిగులుపడుతూ ఉండవచ్చనీ భావించాడు.

“మిస్ రాధా! మీరు అనవసరంగా ఆందోళనపడుతున్నారు వేణుకేం ఫరవా లేదని హామీ ఇస్తున్నాను. ఆ విషయంలో మీరు బెంగపడవద్దు ఇకపోతే గతించిన కాలాన్ని. ఏవేవో సంఘటనలనూ తల్చుకొని కుమిలిపోతున్నారు గతాన్ని తల్చుకొని ఎన్నడూ చింతించకండి. వర్తమానంలో అనుక్షణం ఆనందంగా గడపటం అలవర్చుకోండి. భవిష్యత్తును

సుఖప్రదంగా మలుచుకోవడం కోసం కృషి చెయ్యండి. కష్టనష్టాలూ, చిక్కు సమస్యలూ, విషమ పరిస్థితులూ జీవన మార్గంలో తారసపడడం సహజం. వాటిని ఖాతరుచెయ్యకుండా ధైర్యంగా ముందుకు సాగిపోవాలి. అనుక్షణం కృంగిపోవడం వల్ల ప్రయోజనం లేదు. ధైర్యంగా వుండండి సమస్యలు వాటంతట అవే పరిష్కారమవుతాయి. పరిస్థితులు చక్కబడతాయి." అన్నాడు అనునయంగా.

సుధాకర్ మాటలు రాధకు ఊరట కలిగించాయి. ఆ మాటల్లోని చల్లదనం, ఆప్యాయతా ఆమె హృదయాన్ని రంజింపజేసాయి. ఏదో తెలియని ఆనందం, కొండంత ధైర్యం ఆవహించాయి. 'మనసు చల్లనిదైతే మాటలు చల్లగా వుంటాయి. అందమైన రూపం అంతకన్న అందమైన మనసు సుధాకర్ లాంటి అమృతమూర్తి తోడుగా వుంటే జీవితంలో సుఖసంతోషాలకు లోటుండదు' అనుకుంటూ అతకేసి ఆరాధనగా చూసింది.

"నా మాటలు మీ మనసును మళ్లీ బాధించాయా...." అడిగాడు సుధాకర్ అమాయకంగా

రాధ మనసు అర్థమైంది.

"లేదు డాక్టర్.... లేదు . మీ మాటల్లో ఎంతో సత్యముంది అవి నిజంగా అమృతపు జల్లులా వున్నాయి. ఈ క్షణం నుంచీ మీరు చెప్పినవిధంగా ప్రవర్తించడానికి ప్రయత్నిస్తాను డాక్టర్ ...." అంది చిన్నగా నవ్వుతూ.

"గుడ్ గర్ల్ .... యు ఆర్ నైస్ గర్ల్ ఇండీడ్....ఆడపిల్లలు ఎప్పుడూ అలా నవ్వుతూ కళకళలాడుతూ వుండాలి," అన్నాడు సుధాకర్ నవ్వుతూ.

రాధ నవ్వేసి వూరుకుంది.

"ఆల్‌రైట్ మిస్ రాధా .... మీరు రెస్టు తీసుకోండి ... అనవసరంగా ఏవో ఆలోచనలు పెట్టుకొని మనసు పాడు చేసుకోకండి .... నేను మళ్ళీ రేపు ఉదయం వస్తాను. అప్పుడు కూడా ఇలా దిగులుగా కూర్చుంటే సహించేది లేదు" అంటూ లేచాడు. "మరి నే వెళ్ళి రానా?" అన్నాడు సుధాకర్ అనురాగ పూర్వకంగా చూస్తూ.

"యస్ డాక్టర్..." అంది రాధ, అతని చూపులకు తట్టుకోలేక కళ్ళు క్రిందకు వాల్చేస్తూ.

రాధకేసి మరో సారి తన్మయంగా చూశాడు సుధాకర్. అందంగా అమాయకంగా కనిపించే రాధను వదలి అంత తొందరగా వెళ్ళిపోవడానికి మనసు ఇచ్చగించడంలేదు. అతి కష్టంమీద నిగ్రహించుకొని భారంగా అక్కడ నుంచి కదిలిపోయాడు.

రాధ గాఢంగా నిట్టూర్చింది.

సుధాకర్ వెళ్ళిపోగానే ఆ గదిలో ఏదో వెలితి ఏర్పడినట్టయింది. అతను

మరి కాసేపు కూర్చుని మాట్లాడితే బావుణ్ననిపించింది. అమృతపు జల్లు లాంటి అతని మాటలు ఇంకా ఇంకా వినాలనిపించింది. అందంగా హుందాగా వుండే అతని విగ్రహాన్ని మళ్ళీ మళ్ళీ చూడాలనిపించింది. తనకు తెలీకుండానే హృదయం నిండా సుధాకర్ సుందర రూపాన్ని నింపుకుంది. అంతరంగంలో ఏవేవో ఆశలు చిగురించాయి. మధుర మైన ఊహలు చెలరేగాయి. అంతలోనే తల విదిలించేసి దీర్ఘంగా నిట్టూర్చింది రాధ. 'పగటి కలలు ఫలించవు' అనుకుంటూ కిటికీలోంచి అవతలకు చూసింది.

కిటికీకి కాస్త దగ్గరగా అవతల గార్డెన్‌లో ఒక గులాబీ మొక్క. దాని కొమ్మ చివర ఒకే ఒక గులాబీ పువ్వు. అది గాలికి అటూ ఇటూ ఊగుతోంది. అందాలు విరజిమ్ముతోంది. 'నేను ఏకాకిని.... ఆ పువ్వులాగే.... అది గాలికి అటూ ఇటూ వూగుతోంది అల్లల్లాడి పోతోంది.... తాజాగా ఉన్న తరుణంలో ముచ్చటపడి ఎవరో దాన్ని కోసేస్తారు. ఆ తరువాత అది వాడిపోతుంది. నలిగి పోతుంది నేలపాలయి ధూళిలో కలిసిపో తుంది .... అక్కడికి దాని కథ ముగుస్తుంది ..దానికి రక్షణ లేదు. అందు బాటులో వుంది కనుక ఎవరైనా దాన్ని కోసేయవచ్చు....నాకూ రక్షణ లేదు.... ఏ దిక్కూ లేదు ...' అనుకుంది రాధ ఆ పువ్వునే తదేకంగా చూస్తూ

అలా అనుకుంటూంటే రాధకి విపరీత మైన భయం వేసింది. ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చింది. అనుక్షణం భయంగా, బాధామయంగా గడిచే బ్రతుకు మీద విరక్తి కలిగింది. శంకర్ సుధాకర్ మాటలు చెవుల్లో మారుమ్రోగుతున్నాయి కాని వాటిని ఆచరణలో పెట్టడం అసాధ్యమనిపించింది. మళ్ళీ యధా ప్రకారం నిరాశానిస్పృహలు రాధను చుట్టుముట్టేశాయి. [illegible] ఈ ప్రపంచంలో బ్రతకడం దుర్భర మనిపించింది. గడచిన కాలమే సుఖప్రద మైనదీ, ఆనందదాయకమైనదీ అనిపించింది 'ఆ రోజుల్లో అమ్మ వుండేది .... అన్న వుండేవాడు .... అందుకే ఆ జీవితం అంత హాయిగా మధురంగా గడిచి మధురస్మృతిగా మిగిలిపోయింది' అనుకుంది మనసు వికలమయింది. ఏవేవో ఆలోచనలు చుట్టుముట్టాయి. బెడ్ మీద వాలిపోయి అశాంతిగా అటూ ఇటూ దొర్లసాగింది.

* * *

జీవితంలో అనాధగా మిగిలిపోయిన రోజున దిక్కుతోచక విలపిస్తున్న సమయంలో, పొరుగింటి పంకజం దగ్గరగా తీసుకొని ఓదార్చింది. "చూడు రాధా....ఇలా ఏడుస్తూ ఈ కొంపలో కూర్చుంటే పోయిన నీ అన్న తిరిగి రాడు నామాట విను. నీకేం భయం లేదు. నీకెవరూ లేరని దిగులుపడకు...

కష్టం మరిచిపోయేవరకు మా ఇంట్లో కొన్నాళ్ళు వుండాలి రా.... రేపో మాపో ఇల్లుగలవాళ్ళు ఎలాగూ పొమ్మంటారు. తన కొంపలో డోలూ అమ్మేసి వాళ్ళ కివ్వాల్సిన అద్దె పాత బాకీతో సహా పారేసి వద్దాం" అంది.

ఆ క్షణాన అంతకన్నా గత్యంతరం లేదనుకున్న రాధ, పంకజం చెప్పినట్టు చేసేసి ఆమెవెంట వచ్చేసింది.

అంచుమించు నెల రోజులు అయోమయంగానే గడిచాయి. పంకజం ఇంట్లో వుండి తను వదిలేసిన పక్కింటి కేసి చూసినప్పుడూ, తీరిక వేళల్లోనూ, ముఖ్యంగా రాత్రిపూట తనకి కేటాయించబడిన గదిలో ఒంటరిగా పడుకున్నప్పుడు తన చిన్న తనం, ఆ రోజుల్లో తను ఏరగని [illegible]కోసం దిగులుపడుతుంటే తల్లి బుజ్జగించడం, తనే సర్వస్వం అన్నట్టు సాకిన తల్లి చూపిన ఆదరాభిమానాలు, తల్లితోనూ అన్నతోనూ ఆడుకున్న ఆటలూ, చదువుకున్న రోజులూ, బి.ఏ పాసయిననాడు తల్లీ, అన్నా పొందిన ఆనందం, హఠాత్తుగా తల్లి చచ్చిపోవడం, ఆ తరువాత పడిన నరకయాతనలూ, తనని అనాధగా వదిలేసి లోకాన్ని విడిచిన అన్న... అలా ఎంత వద్దనుకున్నా గతం గుర్తుకొచ్చి, అందుకు సంబంధించిన దృశ్యాలు కళ్ళముందు కదలాడుతుంటే ... గుండె భారం తగ్గేవరకూ రోదిస్తూ రోజులు గడిపింది రాధ.

మరో నెల గడిచేసరికి దిగులు కాస్త దూరమైంది. ఆ మాత్రం నీడ పంకజం ఇంట్లో దొరికింది కాబట్టి ఆ వూళ్ళోనే వుండిపోయి ఎక్కడైనా చిన్న ఉద్యోగం సంపాదించుకొని పంకజానికి తనవల్ల ఏర్పడిన భారాన్ని తొలగించాలని నిశ్చయించుకుంది. అయితే ఆ నిశ్చయాన్ని ఆ తరువాత గడిచిన వారం రోజుల్లోనే సడలించుకోవాల్సి వచ్చింది.

ఇదివరకు అనుభవానికి రానిదీ, ఎన్నడూ తలంచనిదీ, కనీసం కలలో కూడా ఊహించని సంఘటన జరగడంతో భయవిహ్వల అయిన రాధకు ఇంకా ఆ యింట్లో వుండడం శ్రేయస్కరం కాదనిపించింది. అనుభవం కొత్తదే అయినా అదెంతో జుగుప్సాకరంగానూ, తల్చుకుంటే ఒళ్ళు జలదరింపజేసేదిగాను వుంది. శరీరానికి మనసుకి ఏదో మాలిన్యం, కడిగేసుకున్నా వదలని మాలిన్యం అంటుకుపోయినట్టనిపించింది. తన బాధను పంకజంతో చెప్పుకోలేక తనలో ఇముడ్చుకోలేక సతమతమయింది. ఆ ఇంట్లో పంకజం ఎన్ని రకాల సౌకర్యాలేర్పరిచినా ఎంత ఆదరంగా చూసుకుంటున్నా, పదే పదే ఆ సంఘటన గుర్తుకొచ్చి అనుక్షణం బెరుగ్గానూ, ఎప్పుడేం ప్రమాదం ముంచుకొస్తుందో అని భయంగానూ వుండడం వల్ల అక్కడ నిశ్చింతగా నిర్భయంగా బ్రతకడం అసాధ్యమనిపించింది రాధకి.

దినదిన గండంగా కాలం గడుస్తోంది ఆ యింట్లో.

ఓ రోజు అర్ధరాత్రి దాటాక రాధ గదిలోంచి వెలువడిన అరుపులూ, కేకలూ విని పంకజం పరుగు పరుగున వెళ్ళడంతో ఆమె భర్త భుజంగరావు ప్రయత్నానికి అంతరాయం కలిగింది భర్త చర్యను అపరిమితంగా ఏవగించు కుంది పంకజం....

"ఛీ....వయసు పెరుగుతున్న కొద్దీ బుద్ధి తరిగిపోతోంది....సిగ్గు లేకపోతే సరి. నోరారా 'అన్నా' అని పిలిచే ఆ పిల్లమీద అత్యాచారం చెయ్యడానికి మీ మనసెలా ఒప్పింది? ఆడపిల్ల ఒంటరిది. వంటింటి కుందేలులా పడివుంది ఏం చేసినా చెల్లుతుందనేగా మీ ధీమా.... ఏదో నాలుగురోజులు మన ఇంట్లో వుండి దుఃఖాన్ని మరిచిపోతోందని చేర దీశాను. ఆనాడు మీరు సంతోషంగా అంగీకరిస్తే పొంగిపోయాను. కాని మీ ఔదార్యానికి వెనుక ఇంత కుత్సితం వుందని గ్రహించలేకపోయాను. మీరు ఉత్తమ వ్యక్తిత్వం గలవారనీ గొప్ప సంస్కారవంతులనీ భావించాను. కాని ఇంతటి కుసంస్కారులని కలలో కూడా అనుకోలేదు ఆడది ఒంటరిగా చిక్కి నప్పుడు బయటపడుతుందన్నమాట అసలైన సంస్కారం.... ఇదే మీరు చేశారు కాబట్టి ఫరవాలేదు. పరువు ప్రతిష్ఠలకు భంగం రాదు. యథాప్రకారంగా సంఘంలో పెద్దమనిషిగా చెలామణీ అయిపోవచ్చు. అదే నేను చేస్తే? .... ఏ యువకుణ్ణో ఇంట్లో పెడితే కథ రచ్చకెక్కిపోతుంది. పరువు ప్రతిష్ఠలు మంటగలిసిపోతాయి. సమాజం నన్ను కుక్కను కొట్టినట్టు కొట్టి తరిమేస్తుంది. మీకో న్యాయం....మాకో న్యాయం.... ఛీఛీ...."

భుజంగరావు ముఖం జేవురించింది. తీక్షణంగా ఓ సారి పంకజంకేసి చూసి బయటకు నడిచాడు. ఒకప్పుడు తన అపూర్వమైన అందాన్నీ ఆకర్షణీయమైన అంగసౌష్టవాన్నీ చూసుకొని మురిసిపోయిన రాధ. ఆ దుర్ఘటన జరిగిన తరువాత 'ఈ అందం, ఆకర్షణా హఠాత్తుగా పోయి అనాకారిగా మారిపోతే బావుణ్ణు, అప్పుడు నిశ్చింతగా బ్రతకొచ్చు' అనుకుంది ఏడుస్తూ. తన అన్ననీ భుజంగరావునీ పరిపోల్చి చూసుకుంది. మానవుడికీ దానవుడికీ వున్నంత వ్యత్యాసం కనిపిస్తూంటే 'అన్నా' అని పిలిపించుకున్న వాళ్ళందరూ అన్నలు కారు. కాలేరేమో' అనుకుంది. అలా అనుకుంటూంటే ఆమె అన్న సురేష్ గుర్తొచ్చాడు.

తల్లి వున్నప్పుడూ, ఆమె పోయాకా, అన్న తనపట్ల చూపిన అప్యాయతా, ఆదరణా-అన్నతో కలిసి ఆడుకోవడం, బడికి వెళ్ళడం లాంటి దృశ్యాలు మనసులో కదలాడాయి. చెల్లెలి సుఖం

కోసం విధీవిరామం లేకుండా కష్టపడే వాడు సురేష్. వేళకి తగిన నిద్రాహారాలు లేకపోవడం వల్ల ఆరోగ్యం పాడయింది. అశ్రద్ధ చేశాడు. సాధ్యమైనంత ఎక్కువ డబ్బు పోగుచేసి, పెద్దమొత్తం కట్నంగా ఇచ్చి గొప్పింటి సంబంధం తెచ్చి చెల్లెలి పెళ్ళి ఘనంగా జరిపించాలనే ఆకాంక్ష అతని ఆరోగ్యంకోసం, సుఖంకోసం డబ్బు ఖర్చు చెయ్యనివ్వలేదు. తాత్కాలికంగా గుణమిచ్చే మందులు వాడి కాలం గడిపాడు. రోగం ముదిరింది. కూడబెట్టినదంతా కరిగిపోయింది. చివరకు శూన్యఫలితమే దక్కింది. డాక్టర్లు పెదవి విరిచేశారని తెలిసి సురేష్ కృంగిపోయాడు. "అమ్మా రాధా .... అంతా సర్వనాశనమైంది. మానవుడు తలచినది జరగడం అసంభవమేమో.... ఇంక నీకు మిగిలిన నీడ ఒక్కటే.... అక్కడికి వెళ్ళిపో .... ఈ నా వుత్తరం వాడికి చూపించు .... వాడు నిన్ను ఆదుకుంటాడని ఆశపడుతున్నాను. దానికైనా దైవం అనుకూలిస్తాడో లేదో...." ఆయాసపడుతూ ఉత్తరం అందించి చెల్లెలికేసి దీనంగా చూస్తూండిపోయాడు సురేష్. ఆ చూపు అలాగే నిలిచిపోయింది. అనాధగా మిగిలిపోయిన రాధ ఘొల్లుమంది. గుండెలు అవిసేలా రోదించింది. పంకజం ఇంట్లో తనకు దొరికిన ఆశ్రయం 'పడగనీడ' అని నిర్ధారణ అయిపోయాక పంకజాన్ని ఒప్పించి బయటపడింది రాధ.

సురేష్ రాసిన ఉత్తరం చదివి అమితంగా విచారించాడు వేణు. చిన్నతనంలో తను పోగొట్టుకొన్న చెల్లెల్ని తల్చుకుంటూ రాధకేసి జాలిగా చూశాడు. అతని హృదయం ద్రవించింది. "బాధపడకు రాధా.... ఇకనుంచీ ఇది నీ ఇల్లే అనుకో.... సాధ్యమైనంత వరకూ ఇక్కడ నీకేలోటూ రాకుండా చూసుకుంటాను. నువ్విక నిశ్చింతగా వుండు" అంటూ, "రాగిణీ" అని భార్యని పిలిచాడు. ఆమె రాగానే "చూడు రాగిణీ ఈమే రాధ. నా ఫ్రెండ్ సురేష్ చెల్లెలు. ఆనాడు తన ప్రాణాన్ని సైతం లెక్కచెయ్యకుండా నదిలో దూకి కొట్టుకుపోతున్న నన్ను రక్షించిన సురేష్ ఈనాడు లేడు. ఎన్ని జన్మలెత్తినా అతని ఋణం మనం తీర్చుకోలేం.... తన చెల్లెలు దిక్కులేనిదైపోతుందని ఆమెకు కాస్త నీడ నివ్వమని అంతిమ సమయంలో నాకీ లెటర్ రాశాడు. అతని కోరిక మనం నెరవేర్చాలి. రాధ ఇకనుంచి మన దగ్గరే వుంటుంది. ఆమె ఏ విషయంలోనూ కష్టపడకుండా చూడు...." అన్నాడు.

అలాగే అన్నట్లు తలవూపి చిన్నగా నవ్వుతూ రాధను దగ్గరగా తీసుకుంది రాగిణి. ఆనాటినుంచీ ఆ ఇంట్లో ఒకరుగా కలిసిపోయింది రాధ. అనుక్షణం ఆ ఇంట్లో తను పొందుతున్న ఆదరాభిమానాలకు ఉక్కిరిబిక్కిరవుతోంది.

వేణు - రాగిణిల మనస్సులలో గాని ప్రవర్తనలో గాని అణుమాత్రమైనా కల్మషం కనిపించకపోవడంతో 'వాళ్ళు నిజంగా దేవతలు' అని ఎన్నోసార్లనుకుంది ... దిగులు పడడం లేదు. భయం బెరుకు ... నలే లేవు. ప్రతి క్షణం ఆనందంగానే గడుస్తోంది.

రోజులు ... హాయిగా గడిచి పోతున్నా తనవల్ల వేణుకి ఆర్థికంగా ఇబ్బంది కలుగుతోందేమోనని చాలా రోజులు మదనపడింది. రాను రాను ఆ చింత పెచ్చుమీరడంతో వేణుని బల వంతపెట్టి లతని పలుకుబడి మీద ఓ చిన్న కంపెనీలో ఉద్యోగం సంపాదించింది. మనసు కుదుటపడింది జీవించడానికో దారి దొరికిందనే ధైర్యం ఏర్పడింది. ఉల్లాసంగా కాలం గడుపుతోంది.

ఎప్పుడో కాని గతం గుర్తుకురావడం లేదు రాధకు. పంకజం ఇంట్లో అనుక్షణం భయంగా, బెరుగ్గా గడిచిన జీవితం, ఆ ఇంట్లో ... ను ఎదుర్కొన్న విషమ పరిస్థితులూ అప్పుడప్పుడు మదిలో మెదిలేవి. కాసేపు మనసు చిందర వందరయినా ఈ జీవితం ఆనందంగా గడుస్తుండడం వల్ల ఆ చింత ఎక్కువ సేపు నిలవడంలేదు. ఆ జీవితాన్నీ, ఇప్పటి బ్రతుకునూ పోల్చి చూసుకుంటే నరకంలోంచి స్వర్గంలో కొచ్చినట్లుండ డమే కాకుండా ఏ విధమైన లోటూ రాకుండా, ఏ విషయంలోనూ ... కష్టపడకుండా ఆదరంగా చూసుకుంటున్న వేణు అన్నని మరిపించాడు అతని పట్ల గల ఆత్మీయతను మరింత పెంచుకుంది. పవిత్రమైన అనుబంధాన్ని ఏర్పరచుకుంది.

ఏ విధమైన బంధుత్వం, రక్త సంబంధం లేని ఆ అనుబంధం లోకానికి విడ్డూరంగా కనిపించింది. రకరకాల కట్టు కథలూ దవంతులు నోసుక్కోవడాలూ, ఛీత్కారాలూ అవహేళనలూ ఆరంభమయాయి రాగిణి బ్రతుకు నాశనమైపోతోందని వాపోయారు. ఆమెపట్ల తమ ప్రగాఢ సానుభూతిని కనబరుస్తూ రకరకాలుగా కబుర్లు చెప్పి అనుమాన బీజాలు నాటి ఆమె మనసును విరిచేరు.

రాగిణి మొదట లోకుల మాటల్ని అంతగా పట్టించుకోకపోయినా, రాను రాను ఆమెకి కూడా వేణు రాధల ప్రవర్తన విచిత్రంగానూ, ఎబ్బెట్టుగానూ కనిపించింది. మునుపటికన్నా రాధ ఉత్సాహంగా వుండడం, ప్రత్యేకంగా అలంకరించుకోవడం, వేణుతో కలిసి కేరమ్స్ చదరంగం లాంటి ఆటలు ఆడుతూండడం, ఇద్దరూ కూర్చుని సరదాగా కబుర్లుచెప్పుకోవడం,నవ్వుకుంటూండడం ఇలాంటివన్నీ లోకులు తన కళ్ళకి తగిలించిన రంగుటద్దాల్లోంచి గమనిస్తున్న రాగిణి మనసులో తీవ్రమైన సంఘర్షణ మొదలైంది. క్రమక్రమంగా ఆమెలో అనుమానం ఇనుమడించింది.

అసూయాద్వేషాలతో వేగిపోయింది. చివరకు భరించలేక ఓ రోజు వేణుని నిలదీసింది.

ఇద్దరి మధ్య తీవ్రమైన వాగ్వివాదం జరిగింది.

ఆ సమయంలో ఆవేశం పనికిరాదనీ పరిస్థితిని శాంతంగా చక్కబరచాలనీ నిశ్చయించుకొని, కోపాన్ని అదుపులో పెట్టుకున్నాడు వేణు భార్యకు నచ్చ చెప్పే ధోరణిలో - "చూడు రాగిణీ.... రక్త సంబంధం లేకపోయినా మా మధ్య నిష్కల్మషమైన అనుబంధం వుంది. పవిత్రమైన ఆత్మీయత వుంది. ఆ నిజం నీకు తెలుసు. చదువూ, సంస్కారం గల నువ్వు ఎందుకిలా మారిపోయావో నాకు తెలుసు, చాలా రోజులుగా నిన్ను గమనిస్తున్నాను. నీకు నిజం తెలుసు గనుక నీకు నువ్వే సర్దుకుంటావని భావించాను. కాని చివరకు ఈ స్థితికి దిగజారిపోతావని అనుకోలేదు. చెప్పుడు మాటలు విని ఏదేదో వూహించుకొని ప్రశాంతంగా మధురాతిమధురంగా వుండే మన ఇంటి వాతావరణాన్ని కలుషితం చెయ్యకు. నువ్వనుకుంటున్నంత దౌర్భాగ్యస్థితికి నేను దిగజారలేదు దిగ జారలేను. నా మాట విని అర్థంలేని అనుమానాలు మనసులో పెట్టుకొని స్వర్గంలో నరకాన్ని సృష్టించకు. సాటి స్త్రీగా, ఈ ఇంటి ఆడబిడ్డగా గౌరవించు. ఆదరించు...." అన్నాడు అతిసౌమ్యంగా.

మనసు విరిగిన రాగిణి అతని మాటలు నమ్మలేకపోయింది.

"అదంతా నాకు తెలీదు .... అది ఈ ఇంట్లో వుంటే ఎన్ని అనర్థాలైనా జర గొచ్చు యోగులూ, మహాయోగులూ, మహాతపస్వులున్నులే ఆడదాని ఓర చూపుకి దాసులైపోయారు. మీరనగా ఎంత?.... ఆడపిల్ల. ఏ దిక్కూ లేనిదని జాలిపడి ఆదరించాను కాని నా కొంపకే ఎసరు పెడుతుందనీ నాకూ మీకూ మధ్య చేరి మిమ్మల్ని నాకు దూరంచేసే విశ్వాస ఘాతకురాలవుతుందని కలలో కూడా అనుకోలేదు. ఇక మీరెన్ని చెప్పినా నమ్మదల్చుకోలేదు. అనుబంధాలూ, ఆత్మీయతలూ అంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పి నన్ను మభ్యపెట్టడానికి ప్రయ త్నించకండి. తక్షణం దాన్ని బయటకు గెంటండి." అరిచింది ఆవేశంగా.

"నా కంఠంలో ప్రాణముండగా అలాంటి ఘోరం జరగదు." విసిగిపోయిన వేణు దృఢంగా అన్నాడు. రాగిణి రెచ్చి పోయింది.

"ఏం దాన్ని వదులుకోవడానికి అంత కష్టంగా వుందా? అయితే దాన్నే వుంచుకుని సుఖపడండి. ఇద్దరూ కలిసి ఊరేగండి. మీ రాసలీలలకు అడ్డంగా నేనెందుకు? నేను వెళ్ళిపోతాను. నా అడ్డు తీరిపోయాక మీ ఇష్టం వచ్చినట్లు దానితో తందనాలాడొచ్చు." అరిచింది క్రోధంగా చూస్తూ.

వేణు కోపం పట్టలేకపోయాడు. రాగిణి చెంప చెళ్ళుమనిపించాడు. "రాధకీ నాకూ అక్రమ సంబంధాలేం లేవు. హద్దులు మీరి అవహ్యంగా మాట్లాడక మనసు కష్టపడే మాటలంటే మర్యాద దక్కదు" అరిచాడు.

"ఇంతవరకూ వచ్చిందన్న మాట వ్యవహారం !" ఆగ్రహావేశాలతో వూగిపోతూ తన గదిలోకి వెళ్ళి అయిదు నిముషాల్లో తిరిగొచ్చింది రాగిణి.

"దానికీ మీకూ ఏ సంబంధం వుందో మీకు బాగా తెలుసు. ఇటుపైన మీకూ నాకూ ఏ సంబంధంలేదనీ కూడా తెలుసుకోండి" అనేసి చేతిలో సూట్‌కేస్‌తో చరచర బయటకు నడిచింది రాగిణి.

వేణు నిశ్చేష్టుడయాడు.

ఆ మరుక్షణంలోనే రాధకూడా ఇంట్లోంచి వెళ్ళిపోవడం అతను గమనించలేదు. పిచ్చివాడిలా చూస్తూ శిలా విగ్రహంలా నిలబడిపోయాడు.

* * *

రాధ కళ్ళు తెరిచింది. తన ముఖంలోకి ఆదుర్దాగా చూస్తూ కనిపించాడు డాక్టర్ సుధాకర్.

"డాక్టర్...." అంది నీరసంగా.

"యస్ మిస్ రాధా....హౌ డూ యూ ఫీల్ నౌ...." ఆప్యాయంగా అడిగాడు సుధాకర్.

రాధ సమాధానం చెప్పలేదు. నెమ్మదిగా లేచి కూర్చుని అయోమయంగా ఆ గదిగోడలకేసి చూడసాగింది.

"ఇది మా ఇంట్లో ఓ అందమైన గది.... హాస్పిటల్‌లో ఇంకా వుంచితే మళ్ళీ స్లీపింగ్ టాబ్లెట్స్ దొంగిలించి మింగేస్తారని భయపడి మిమ్మల్నిక్కడికి తరలించాను...." అన్నాడు సుధాకర్ నవ్వుతూ.

రాధ తల వంచుకుంది. ఆమె కళ్ళు వర్షించడానికి సిద్ధంగా వున్నాయి. "నన్ను బ్రతికించి శిక్ష పొడిగించారు డాక్టర్...." అంది గద్గదికంగా.

"వాట్ !!.... శిక్ష పొడిగించానా !!" అరిచాడు సుధాకర్.

"యస్ డాక్టర్.... బ్రతికుండి ఈ శిక్షను అనుభవించేకంటే చావడమే నయం...."

"....మీ మాటలు నా కర్థంకావడం లేదు.... ప్లీజ్.... కాస్త క్లియర్‌గా చెప్పండి...మీరనుభవిస్తున్న శిక్ష ఏమిటి? అసలు మీరెందుకు చచ్చిపోవా లనుకున్నారు."

రాధ నిర్జీవంగా నవ్వింది.

"నా జీవితమే ఒక శిక్ష డాక్టర్.... ఏ జన్మలోనో చేసుకున్న పాపానికి ఈ ఒంటరి బ్రతుకు శిక్షగా విధించబడిందనిపిస్తోంది...చూడండి డాక్టర్..మీవంటి విజ్ఞాన సంపన్నులకు లోకంలో ఒంటరి ఆడదాని బ్రతుకు దుర్భరమని చెప్ప నవసరంలేదు. నేను ఒంటరిదాన్ని - ఏ దిక్కూ లేనిదాన్ని నా బ్రతుకెంత భయంకరంగా గడుస్తోందో. అడుగడుగునా

నే నెన్ని విషమపరిస్థితులనూ, క్లిష్టసమస్యలనూ ఎదుర్కొంటున్నానో, నాకెంత రక్షణ ఉందో, ఎంత గౌరవం వుంటుందో విశదీకరించి చెప్పనవసరంలేదు.... ఎన్ని కష్టనిష్టూరా లెదురవుతున్నా గౌరవంగా బ్రతకాలని ధైర్యంగా పరిస్థితులతో పోరాడాను. కాని ఫలితం శూన్యం. నాలో ఓరిమి నశించింది. బ్రతుకుమీద ఆసక్తి ఏనాడో అంతరించింది... అయితే నిన్న సాయంకాలం మీమాటలు విన్నాక నాలో ఏదో నూతనశక్తి ప్రవేశించినట్టయింది బ్రతకాలనే ఆశ చిగురించింది. కాని కాని మీరు వెళ్లిపోయాక యధాప్రకారం నిరాశ, నిస్పృహలు ఆవహించాయి. ఏవేవో ఆలోచనలతో రాత్రి మూడు గంటలు దాటేవరకూ అశాంతిగా గడిపాను. మనసు చిందరవందర రయి పోయింది. చావాలో బ్రతకాలో తేల్చుకోలేక చాలాసేపు మధనపడ్డాను చివరకు దినదినగండంగా గడిచే జీవితాన్ని అంతం చేసుకోవడమే మేలనిపించింది..." రాధ గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. మాట్లాడలేక తల వంచేసుకుంది.

"మిస్ రాధా ... ఇంతకాలం మీరు పడిన బాధలవల్ల మీ కలా అనిపించింది. బాధమయమైన జీవితంమీద విరక్తి కలగడం సహజం. అంతమాత్రంచేత అమూల్యమైన జీవితాన్ని అంతంచేసుకోడానికి ప్రయత్నించడం వివేకవంతుల లక్షణం కాదు...మానవత్వం లేని వాళ్లె వరో మీకు హానిచేశారు. మిమ్మల్ని అవమానించారు. క్రూరమృగాల్లా వెంటబడి మిమ్మల్ని బయపెట్టారు వాళ్లు అసలైన రాక్షసులు. వాళ్ల బారినుండి తప్పించుకుంటూ బ్రతకడం కష్టసాధ్యమే కాని వారితోబాటు మంచి మనసున్న మనుషులెందరో ఈ లోకంలో వున్నారు. వాళ్ళ సహాయ సహకారాలందుకుంటూ నిర్భయంగా నిశ్చింతంగా వుండడం అలవర్చుకోండి... మీ కెవరూ లేరని దిగులుపడడం మానేసి మీ చుట్టూ వుండే వ్యక్తుల్ని జాగ్రత్తగా గమనించండి. ఎంతోమంది ఆత్మీయులూ, ఆప్త మిత్రులూ కనిపిస్తారు. మీ మేలుకోరే వాళ్లూ మీ అభివృద్ధిని కాంక్షించేవాళ్లూ, మీ ఔన్నత్యాన్ని చూసి ఆనందించేవాళ్లూ ఎంతోమంది కనిపిస్తారు..."మాట్లాడడం ఆపి దీర్ఘశ్వాస తీసుకున్నాడు సుధాకర్.

"మానవులందరూ దానవులనీ, నేను కేవలం క్రూరమృగాల మధ్య బ్రతుకుతున్నాననీ అనడంలేదు డాక్టర్.. ఇంత వరకూ నేనెరిగిన వాళ్లలో ఎంతోమంది సత్ప్రవర్తనులున్నారు. మహానుభావులున్నారు. మహాత్ములూ ఉన్నారు. వారిలో ఒకడైన వేణు సహృదయుడు. సంస్కారవంతుడు నన్నెంతో ఆదరించాడు. గౌరవించాడు, అది లోకానికి విడ్డూరంగా కనిపించింది. మాఇద్దరి మధ్య ఏర్పడిన అన్నచెల్లి అనే పవిత్రమైన అనుబంధాన్ని శంకించారు. అక్రమసంబంధా లంటగట్టి

హీనంగా చూశారు. చివరకు రాగిణి మనసు విరిచేశారు పచ్చని సంసారాన్ని విచ్ఛిన్నం చేసేసి ఆనందించారు. నేను వేరు ఇంట్లోంచి వచ్చేశాక చాలామంచి నన్ను గౌరవించారు. ఎన్నోవిధాలుగా నాకు సాయంచేశారు. ఆ మహానుభావుడ్ని రకరకాలుగా అవమానించి అవహేళనలు చేసి వాళ్ళ మనుషులు కష్టపెట్టే తాము సంతోషించారు. దీన్నిబట్టిచూస్తే డాక్టర్ ... ఈ రాక్షసులు ఇతరులకు మేలు చెయ్యరు. చేసేవాళ్ళని చెయ్యనివ్వరని తేలిపోయింది. లోకంలో రానురాను మానవత్వం అడుగంటిపోతోందంటే అది కల్లగాదు మంచిని చెడు మింగేస్తున్న రోజులివి. మానవుల్ని దానవులు అణగద్రొక్కేస్తున్న కాలమిది. మానవత్వాన్ని పెంపొందించుకొని దైవత్వాన్ని పొందవలసిన మానవుడు రాక్షసత్వాన్ని అలవర్చుకుంటున్న యుగమిది ఇక ఇది ఇంతే - దీనికి పరిష్కారం లేదు అంతం లేదు." ఆవేశంగా అంది రాధ

డాక్టర్ సుధాకర్ చిరునవ్వు నవ్వాడు.

"ఆల్ రైట్ మిస్ రాధా... ఆవేశపడకండి .. ఇంతవరకూ మీరెన్నో బాధలు పడ్డారు కనుక ఈ లోకంమీద ఏవగింపు కలిగింది బ్రతుకుమీద విరక్తి కలిగింది. ఆత్మహత్యకు పూనుకున్నారు. అదంతా గతం... ప్లీజ్ లీవిట్... ప్రస్తుతం మీకు రక్షణకావాలి. ఒంటరిగా వున్న మీకో జంటకావాలి. ఇవన్నీ కావాలంటే మీరు పెళ్ళి చేసుకోవాలి అప్పుడు మీ జీవితం సుఖంగా సంతోషంగా గడిచిపోతుంది. అంచేత మీకునచ్చిన వ్యక్తిని చూసుకొని పెళ్ళి చేసుకోవడం ఉత్తమం.. "అన్నాడు ఆమె ముఖంలోకి సూటిగా చూస్తూ.

రాధ పేలవంగా నవ్వి తల వంచుకుంది.

"నన్నెవరు చేసుకుంటారు డాక్టర్... కోరినంత కట్నం అడిగినన్ని కానుకలూ ఇచ్చి పెళ్ళిచేసే దిక్కూ మొక్కూ లేని అనాధను... నిన్ను ప్రేమిస్తున్నాను. నిన్ను చూడకపోతే బ్రతకలేను- ఇలాంటి వెన్నో అంటూ వెంటబడి కాటువేయబోయారు కాలసర్పాల్లాంటి మహానీయులు. నా అందాన్ని అనుభవించి అథఃపాతాళంలోకి నెట్టేయబోయారు మరికొందరు మహానుభావులు. కానీ, పైసా కట్నంలేకుండా పెళ్ళిచేసుకోవడానికి ఎవరూ సాహసించలేకపోయారు "అంది గాఢంగా నిట్టూరుస్తూ.

సుధాకర్ కొన్ని క్షణాలు రాధకేసి చూసి, కాసేపు తటపటాయించి "మీకు అభ్యంతరం లేకపోతే నేను సాహసిస్తాను" అన్నాడు.

"మీరా!!..." చప్పున తలెత్తింది రాధ. ఆమె హృదయంలో ఒక్కసారిగా కోటివీణలు మ్రోగాయి. కళ్ళలో నీటి పొరలు కమ్ముకున్నాయి. ఒణుకుతున్న

పెదవులతో "మీరు... మీరు నన్ను చేసుకుంటారా డాక్టర్!?" అంది ఆనం దాశ్చర్యాలతో ఉక్కిరిబిక్కిరవుతూ.

"అవును నేనే రాధా....మీకు అంగీకారమైతే నేను మిమ్మల్ని పెళ్ళిచేసుకుంటాను....మీ పరిస్థితి చూసి జాలిపడి గాని మీ అపూర్వమైన అందాన్ని కాంక్షించి గాని మిమ్మల్ని చేసుకుంటాననడం లేదు. మొదట మిమ్మల్ని చూసిన క్షణంలోనే మీ రూపాన్ని నా హృదయంలో ప్రతిష్ఠించుకున్నాను. ఆ క్షణంనుంచీ ఆరాధిస్తున్నాను. మీరు కాదంటే జీవితాంతం ఆ ఆరాధన అలాగే వుండిపోతుంది. కాని మీ బొమ్మ వి చెరిపేసి నా హృదయంలో మరొకరి రూపాన్ని చిత్రించుకోలేను" అన్నాడు సుధాకర్ రాధముఖంలోకి ప్రేమగా చూస్తూ.

రాధ ముఖం సిగ్గుతో ఎర్రబడింది. కళ్లు క్రిందికి వాల్చేసింది.

"మీ వుద్దేశ్యం ఏమిటో చెప్పండి ప్లీజ్ .... మీకు అంగీకారమేనా? లేక అభ్యంతరాలేమైనా వున్నాయా?" మళ్ళీ అడిగాడు సుధాకర్ మృదువుగా.

రాధ తల వూపింది అంగీకార సూచకంగా. "నాకేం అభ్యంతరం లేదు డాక్టర్! మీ వంటి మహాత్ముడు లభించడం నిజంగా నా అదృష్టమే .... నేను ఏ జన్మలోనూ పాపం చెయ్యలేదనీ – ఇది ఎన్నో జన్మల పుణ్యఫలమనీ భావిస్తున్నాను డాక్టర్ ...." సన్నగా గొణుగుతూ కళ్ళు తుడుచుకుంది రాధ.

"థాంక్యూ మిస్ రాధా .... థాంక్యూ వెరీమచ్ ....అయాం వెరీవెరీ హేపీ నౌ... ఈరోజే మా సిస్టర్‌కి లెటర్ వ్రాస్తాను. ఆమె రాగానే అన్ని ఏర్పాట్లూ చేస్తాను" అన్నాడు సుధాకర్ ఆనందంగా.

పోస్ట్‌మేన్ అందించిన కవరు చించి, అందులోని ఉత్తరాన్ని బయటకు తీసి చదివింది రాగిణి.

ప్రియమైన రాగిణీ,

మనం విడిపోయి ఆరునెలలు దాటింది. ఈ ఆరునెలల్లోనూ అనేక సార్లు నీకు ఉత్తరం రాద్దామని ప్రయత్నించాను. కాని సాహసించలేక పోయాను. ఈనాడు నీకీ వుత్తరం రాసే అదృష్టం నాకు కలిగినందుకు ఎంతో ఆనందంగా వుంది. ఇప్పటికీ నీకు నా మీద కోపంగాని ద్వేషంగాని వుంటే కాసేపు వాటిని మరిచిపోయి ఈ వుత్తరాన్ని చివరి అక్షరం వరకూ చదువమని కోరుతున్నాను.

అనాడు నా మూలంగా వేణూ నువ్వూ ఘర్షణపడి విడిపోయారు. నువ్వు వెళ్ళిన మరుక్షణంలోనే నేనూ ఆ ఇంట్లోంచి వెళ్ళిపోయాను. అనాటినుంచీ వేణు పిచ్చివాడిలా అయిపోయాడు. నువ్వెళ్ళిన మరునాటినుంచీ నాలుగు నెలలు కనిపించకుండా పోయాడు. ఎక్కడెక్కడో తిరిగి రెణ్నెల్ల క్రితం

ఈ వూరొచ్చాడు. అతనిలో పూర్వం వుండే కళ, కాంతి లేవు. ఉత్సాహం లేదు. దీర్ఘ రోగిలా కనిపించాడు. వారం రోజుల క్రితం ఆఫీసు దగ్గర కనిపించి కళ్ళనీరు పెట్టుకున్నాడు. "రాగిణి నన్ను నమ్మలేదు రాధా .... అదేనమ్మా నా అశాంతికి దిగులుకి కారణం .... మరే విషయంలోనైనా తగువుపెట్టుకొని ఆమె వెళ్ళిపోతే నా మనస్సింత కుళ్ళిపోయేది కాదు మనల్ని శంకించి గొడవపడి వెళ్లిపోయినందుకు గుండె బ్రద్దలైపోతోంది. మనసు మార్చుకొని తిరిగి వస్తుందేమోనని ఇంతకాలం ఎదురుచూశాను. కాని ఆమె ఇక రాదని తేలిపోయింది. ఈ జన్మలో మళ్ళీ ఆమెను చూడగలనో లేనో....ఆమెలేని బ్రతుకు శూన్యంగా కనిపిస్తోంది. జీవితంమీద విరక్తి కలుగుతోంది. చచ్చిపోవా లనిపిస్తోంది." అన్నాడు. అతనిముఖంలోని దైన్యాన్ని చూసి నా గుండె నీరయింది. ఏం చెయ్య గలను? అతన్ని ఎలా ఓదార్చగలను?

విన్నటిరోజున వేణు ఏక్సిడెంట్‌లో తీవ్రంగా గాయపడ్డాడు. చాలా రక్తాన్ని కోల్పోయాడు. ఏక్సిడెంట్ యాదృచ్ఛికంగా జరిగిందో లేక ఆత్మహత్యా ప్రయత్నమో తెలీదు. ఎన్ని చోట్ల ప్రయత్నించినా, ప్రాణాపాయ స్థితిలో వున్న వేణూకి సూటయిన రక్తం దొరక్క డాక్టర్ సుధాకర్ ఆశ వదులుకున్నాడు. వేణూకి ఏక్సిడెంట్ అని తెలిసిన తక్షణం హాస్పిటల్‌కి పరుగెత్తాను. డాక్టర్ సుధాకర్ అమితంగా విచారిస్తూ వేణు పరిస్థితి వివరించాడు. నా బలవంతంమీద నా రక్తాన్ని పరీక్షించాడు. దైవికంగా అది సరిపోయింది. వేణుకి అపాయం తప్పింది. డాక్టర్ సుధాకర్ ఆనందానికి అంతులేకుండా పోయింది. నన్నెంతో కొనియాడుతూ ఆప్యాయంగా మాట్లాడాడు. అతని చల్లని మాటలూ, ఉదాత్తమైన ప్రవర్తనా నా మనస్సుకు నచ్చాయి. స్త్రీ జీవితంలో ఒకసారి ప్రేమిస్తుందనీ, ఆమె హృదయంలో ప్రేమించిన ఆ ఒక్కరికే స్థానముంటుందనీ సాటి స్త్రీవైన నీకు చెప్పనవసరం లేదు. విన్నటి వరకూ పాషాణంలా వుండిపోయిన నా హృదయం డాక్టర్ సుధాకర్ నా పట్ల చూపిన ప్రేమాభిమానాలకు కరిగిపోయింది. అతని రూపాన్ని నాకు తెలీకుండానే నా హృదయంలో నింపుకున్నాను. సుధాకర్ కూడా నన్ను ప్రేమిస్తున్నాడని ఈ రోజే తెలిసింది. త్వరలోనే మా వివాహం జరగబోతోంది

రాగిణీ! లోకుల మాటలకు ప్రాధాన్యమిచ్చి వేణూకీ నాకూ మధ్యగల అనుబంధాన్ని శంకించి వెళ్ళిపోయావు. ఆ లోకులీనాడు నీ విషయం పూర్తిగా మరిచిపోయారు నీ సంసారం విచ్ఛిన్నమైందని వాళ్ళేమాత్రం విచారించడం

లేదు. నువ్వెక్కడున్నావో-ఏ అవస్థలు పడుతున్నావో వేణు పరిస్థితి ఏమిటో వాళ్లు తెలుసుకోవడం లేదు వాళ్ళంతో విశ్వాసంగా హాయిగా బ్రతుకుతున్నారు. ఎటొచ్చీ వెనుకబోయింది మనమే

స్త్రీ-పురుషుల మధ్య ఏర్పడిన అనుబంధాన్ని నీచంగా చూడడం తప్పు పవిత్రంగా చూడలేని లోకుల్ని దూరంగా వుంచి-నీ చివరి వాక్యాలను మనసుంచి చదివి సన్నర్థం చేసుకొని నా కోరిక నెరవేరుస్తావని ఆశిస్తున్నాను

నన్ను కంటిరెప్పలా కాపాడుతూ అల్లారుముద్దుగా చూసుకున్న నా అన్న సురేష్ దురదృష్టం కొద్దీ నాకు దూరమయాడు. ఆ భ్రాంతి తీరక నాకు తెలిసిన ఎంతోమందిలో నా అన్నని చూసుకున్నాను. అందరిలోనూ వేణు నా అన్నని మరిపించాడు. అందుకే ఆపదలో వున్న వేణుకి నా రక్తాన్ని ధారపోసి బ్రతికించుకున్నాను. నా అన్న సురేష్‌కీ నాకూ రక్తసంబంధం వుంది. ఈనాడు వేణు శరీరంలో నా రక్తం ప్రసరిస్తోంది దీన్నిబట్టి వేణుకీ నాకూ మధ్యగల సంబంధం-అనుబంధం ఏదైవుంటుందో ఇప్పటికైనా అర్థంచేసుకుని ఈ దీనురాలి ప్రార్థన మన్నించి వెంటనే బయలుదేరి వస్తావని ఆశిస్తున్నాను. నీవు వచ్చేవరకూ నాకూ సుధాకర్‌కీ వివాహం జరగదు ఆశుభకార్యం నువ్వూ - వేణూ కలిసి జరిపించాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను. నీ రాకకు ఆతృతగా ఎదురుచూస్తున్న

నీ రాధ.

ఉత్తరం పూర్తిగా చదివిన రాగిణి కళ్ళు చెమ్మగిల్లాయి. హృదయం ద్రవించింది పశ్చాత్తాపంతో గిలగిలలాడింది. రాధ ఉత్తరాన్ని గుండెకు అదుముకొని "అర్థం చేసుకున్నాను రాధా....నా తప్పు తెలుసుకున్నాను .... తప్పకుండా మేమిద్దరం నీ పెళ్ళి జరిపిస్తాం" అనుకుంటూ కళ్లు మూసుకుంది. కన్నీళ్లు జలజల రాలాయి.

